# 10

## అలుక్కుపోయిన వర్ణచిత్రం...

వెంకటరత్నాన్ని వొక్కటే ప్రశ్న ఎదుర్కొంది.

అది వినా అతడికేమీ తోచలేదు. తను కళ్ళు తెరచి చూస్తున్నా తనచుట్టూ ప్రపంచం కనిపించటంలేదు. తన కీ ప్రపంచంలో ఏమీలేదు. అంతా ముగిసిపోయింది. ఈ ప్రపంచంతో తనకు పనిలేదు. తనతో ఈ ప్రపంచానికి పనిలేదు.

వెంకటరత్నాన్ని ఒక్కటే ప్రశ్న యెదుర్కొంది.

ఎందుకు బ్రతకటం?

అతడికి సమాధానం రాదు. ఎందుకో తెలీదు. ఒకందుకు.

అతడి కళ్ళలో యింకా ఆ మంటలు మండుతూనే ఉన్నాయి.

అతడి కేం చెయ్యాలో తోచటంలేదు. ఆ తలపులను ఎంతగా వదుల్చుకుందామని ప్రయత్నిస్తున్నా వెన్నంటుతూనే వున్నాయి.

తాను ఊహించనిది తనముందే జరిగిపోయింది. అటువంటి కల వచ్చినప్పుడు ఎప్పుడైనా అటువంటి కల ఎందుకు వచ్చిందా అని లేచి కూచుని గంటలతరబడి యేడ్చిన తనకు, ఆ కల తాలూకు దృశ్యాలు నిజంగానే తన కంటిముందు రూపు దిద్దుకున్నాయి.

ఏం చెయ్యాలి ఇప్పుడు? ఎక్కడకుపోవాలి?

ఎలా బ్రతకాలి? ఎందుకు బ్రతకాలి?

వెంకటరత్నానికి కళ్ళలో యేడుపు యిగిరిపోయింది.

'నాన్నా, రత్నం!' అని ఆకాశపు దెసనుంచి పిలుపు వినపడుతున్నది. కాదు ఆ పిలుపు ఎక్కడినుంచి? ఆ మంటలనుంచా?....

తనకు పాలిచ్చి పెంచిన ఆ తనువు చితి మంటలలో చితికి పోయింది.

ఏమి టీ జీవితం?

పసిపాప—అమాయకమైన ముఖం; అమ్మకీ, నాన్నకీ ఆహ్లాదం చేకూర్చటం.

పదేళ్ళపిల్ల—అమ్మకీ, నాన్నకీ 'పెళ్లి ఎలా చేస్తామా' అని దిగులు కల్పించటం.

పదహారేళ్ళ పడుచు—అమ్మనీ నాన్ననీ విడిచి ఏ అయ్య వెంబడో వెళ్ళిపోవడం. అతడికి ప్రియురాలు.

పాతికేళ్ళ ఆమె-అమ్మ. జీవితపోరాటం. శక్తులుడుగుతాయి.

తరవాత? తరవాత అమ్మమ్మ.

ఆ తరవాత జీవితపు ఆఖరి చౌరాస్తా.

ఆ తరవాత దేముడివద్దకు.

ఇదీ జీవితం.

దీన్ని చూసుకునే ఎందుకీ అతిశయం?

వెంకటరత్నం గుబుక్కున యేడ్చాడు. బజారున నడుస్తుంటే అమ్మలాంటి ఆమె కనిపించింది. తా నింక ఎవరినిపిలవాలి అమ్మా అని.

చింతచెట్టుక్రింద ఆ మంటలని చూస్తూ నడుస్తున్నాడు.

ఎక్కడికి పోతున్నా? ఏ దిక్కున పోతున్నా?

అమ్మ జీవితంలో ఎంత ధైర్యంగా పోరాడింది!

దరిద్రంతో ఎలా రాజీపడ్డది!

తాను ఇప్పుడు ఆ ఇంటికి పోవాలి.

వెంకటరత్నాన్ని వా ళ్లింటికి తీసుకొనిపోయి ధైర్యం చెప్పి వెళ్ళిపోయారు అతడిమీద దయగలవాళ్లు, జాలిగలవాళ్లు. వాళ్లు వెళ్ళి పోగానే వాళ్ళవెనకనే బయలుదేరి బజారునపడ్డాడు వెంకటరత్నం ... ఆ ఇంట్లో తా నిక వుండలేడు.

పొద్దున్నే చెల్లెలికి టెలిగ్రాం ఇప్పించారు. ఇంకాసేపటికి

చెల్లాయి వస్తుంది. 'అమ్మ యేదీ?' అని తనని అడుగుతుంది. తాను ఏమిచెపుతాడు? ఏమనిచెపుతాడు? అందుకనే ఇక్కడ ఉండకుండా వెళ్ళి పోతే సరిపోతుంది.

వెంకటరత్నం అలానే సందులగొందుల వెంట తిరిగాడు. ఎన్నో ఆలోచనలు వొకదాని తర్వాత వొకటి ముసురుకుంటున్నా యతణ్ణి. తెరలు తెరలుగా అతడి కళ్ళలో ఆ మంటలు మండు తున్నాయి. ఊరికి దూరంగా పోయి చెరువుకట్టమీద కూచున్నాడు. అప్పటికే కొద్దిగా చీకటిపడింది.

దూరంగా పడమర వేపు ఆకాశం ఎరుపురంగు పూసుకుని మృత్యుదేవత దరహాసాన్ని చూపిస్తున్నది. తాటిచెట్లు చెరువునీళ్లలో ప్రతిఫలిస్తున్నాయి.

చెరువుకట్టమీద గట్టుమీద కూచున్నాడు.తనముందునుంచే నీటి పాము తనని చూసుకుంటూ నీళ్ళలోకి వెళ్ళిపోయింది.

వెంకటరత్నానికి భయం పుట్టలేదు.

వెంకటరత్నానికి భయం పుట్టదు.

వెంకటరత్నానికి దిగులు. వెంకటరత్నమే దిగులు.

చెరువు గట్టుమీద చిటికేశ్వరపు చెట్టు జడలు విరబోసుకున్న దయ్యంలా కనిపిస్తున్నది. అయినా వెంకటరత్నానికి భయం పుట్టలేదు!....

చెరువుకట్ట పక్కనే వో సత్రం వుంది. ఆ సత్రంలో ఖర్మలు చేస్తారు. ఎవరో ధర్మాత్ముడట. ఖర్మలు చేసుకునేందుకే ఆ సత్రం కట్టించాడుట. పిచ్చిముండాకొడుకులావుంది. వెంకటరత్నానికి ఏమి టేమిటో ఊహలు రేకెత్తుతున్నాయి.

తానూ యీ సత్రంలోకి రావాలి. చీకట్లో ఆ సత్రంవేపు చూశాడు. వికృతంగా వుంది. పాడుసత్రం.

అందులో ఎవరో కూచుని తంబురా వాయిస్తున్నాడు.

ఇంకొకడెవరో పాట యెత్తుకున్నాడు.

బాగా చీకటిపడిపోయింది.

'ఎప్పుడో ఏ ఏలనో జీ వెల్లి పోతుంది.
అది సెప్పకను, కనురెప్పపాటున ఎగిరిపోతుంది........'

రాగయుక్తంగా పాడుతున్నాడు, పాడుపాట.
వెంకటరత్నం అక్కడ కూచోలేకపోయినాడు.
లేచి వూరివేపు నడకసాగించాడు.

బజార్లోకొచ్చి గడియారం చూశాడు. ఎనిమిదిన్నర అయింది.
రైలు ఎనిమిదింటికల్లా వచ్చేస్తుంది.

చెల్లెలు వచ్చివుంటుంది. ఇంటిదగ్గర వాక్కటే కూచుని వుంటుంది. వెంకటరత్నం ఇంటికి పోదామనుకున్నాడు. మళ్ళీ ఇంతలోనే దుఃఖమూ, భయమూ, నిరాశా, నిస్పృహా, వొక్కొక్కటి అతణ్ణి ఆవరించుకొన్నాయి.

అక్కడే వొక కిల్లీ కొట్టుపక్కన బెంచీమీద కూచున్నాడు

కొబ్బరితాడుకు నిప్పు ఎర్రగా కాలుతున్నది.

ఎంతమందో వస్తూ పోతూ ఉన్నారు.

వెంకటరత్నానికి యేడుపొచ్చింది. చెయ్యి వణికింది. ఆ కిల్లీ కొట్టతను వెంకటరత్నానికి తెలిసినవాడే.

"ఒక సిగరెట్టు ఇలా తే" అని అడిగాడు వెంకటరత్నం.

కిళ్ళీ కొట్టతను ఆశ్చర్యపోయినాడు.

అయినా తీసి ఇచ్చాడు.

వెంకటరత్నం చేయి వణికింది.

సిగరెట్ వెలిగించుకునేసరికి ముచ్చెమటలు పోసినయ్. కళ్ళ వెంబడి నీళ్లు అలాగే ధారగా కారుతున్నాయి. అతడికెన్నెన్నో సంఘటనలు కళ్ళముందుగా తిరిగిపోయినవి.

తాను సిగరెట్ కాల్చి ఎన్నాళ్ళయింది?

ఎనిమిదేళ్లు కావస్తున్నది.

వెంకటరత్నం సిగరెట్ ముట్టించి పెదవులమధ్య పెట్టుకున్నాడు. అలానే కిల్లీ కొట్టు బెంచీమీద ఆనుకునిపోయినాడు. కళ్లు మూతలు పడ్డాయి.

అప్పుడు వెంకటరత్నానికి పన్నెండేళ్లు. సెకండుఫారం చదువుతున్నాడు. తన ఇంటి పరిస్థితి, తన తల్లి పడుతున్న కష్టం అతడికి తెలియదు. తాను పరీక్ష తప్పితే తన కేడుపు రాలేదు. అమ్మ యేడ్చింది. చిన్నతనం. చెడు సావాసాలు చేసేవాడు. చెప్పిన మాట వినేవాడు కాదు. చెల్లెల్ని కొట్టి యేడ్పించేవాడు. అమ్మ యెంతగానో ప్రాధేయపడి చెప్పేది. బోధపరిచేది. అయినా తనకు తెలిసేదికాదు. అప్పుడు స్నేహితులతో సిగరెట్లు తాగటం కూడ అలవాటు చేసుకున్నాడు. సినిమాలకు పోవటం. చదువుని నిర్లక్ష్యం చెయ్యటం. అలాచేసేవాడు. పరీక్ష తప్పాడు. అప్పుడు అమ్మ ఏడ్చింది. అవాళ నుంచీ తాను పూర్తిగా మారిపోదలచుకున్నాడు.

ఆమె అన్నది. "నిన్ను చూసుకుని బ్రతుకుదామనుకున్నాను. నువు ఇలా చెడిపోయావు. నేను చచ్చిపోతాను." అప్పుడు తాను అమ్మను కావలించుకుని యేడ్చాడు. అవాళనుంచీ మారిపోయినాడు.

అమ్మ వొక పెద్ద ప్లీడరుగారింట్లో వంట చేసేది. అక్కడికెప్పుడైనా తాను పోవాల్సి వచ్చేది. అప్పుడు సిగ్గుతో చచ్చిపోయేవాడతను. అమ్మ యేమీ బాధపడేదికాదు. ఒకరోజు పొయిలోకి చిదుగులు యేరటానికి చెల్లాయి వూరి బయటకు వచ్చింది. ఊళ్ళో అయితే సిగ్గు. చెరువు కట్టమీద సిగరెట్ తాగుతూ తాను కన్పించాడు చెల్లాయికి. చెల్లాయికి తన నలా చూస్తే యేడుపొచ్చింది. ఏడ్చింది. చెల్లాయిని తానా రోజున భయపెట్టాడు. అమ్మతో చెప్పవద్దని. చెల్లాయి ముఖం కాసంత చేసుకుని వెళ్లిపోయింది. సాయంకాలం నక్కుతూనే ఇంటికివెళ్లాడు. అమ్మ తనను ఏమీ అనలేదు. చెల్లాయి

ముఖం తిప్పేసుకుంది. ఒక్క మాట కూడ మాట్లాడలేదు. అమ్మ దగ్గరకు తీసుకుని యెప్పుడూ లేనంతగా బుజ్జగించింది.

అన్నాలు తిని పడుకున్న తర్వాత అమ్మ వచ్చి దగ్గర కూచుంది. చెల్లాయి కూడా ఇంకా నిద్రపోలేదు. అటూ ఇటూ దొర్లుతూ ఉంది పక్కమీద. తాను పలకరిద్దామని ఎంతగానో అనుకున్నాడు. కాని పలకరించలేకపోయినాడు. అమ్మ తల నిము రుతూ, "నాన్నా, ఇవాళ ప్రొద్దున నువ్వు చెల్లాయికి చెరువుకట్ట మీద కనిపించావట, నిజమేనా" అనిఅడిగింది. తనకు యేడుపొచ్చిందప్పుడు. యేడ్చాడు.

"నాన్నా, ఇకెప్పుడైనా ఇలాటి పనులు చేస్తే నేను చచ్చిపోయి నంత వొట్టు. ఏం, చెయ్యవుగదూ" అన్నది అమ్మ.

ఏడుస్తూనే 'చెయ్య' నని చెప్పాడు.

"చూడు, ఒకటేమాట. చెయ్యనని చేశావా, దేముడికి కోప మొస్తుంది. ఒట్టేశానుగా. అప్పుడు నేను చచ్చిపోతాను...."

'అమ్మో, చెయ్యను' అని అమ్మ వొళ్ళో పడుకున్నాడు.

చెల్లాయి మర్రోజు నుంచీ మామూలుగా మాట్లాడింది.

అవాళనుంచీ ఇవాళదాకా వెంకటరత్నం ఎప్పుడూ సిగరెట్టు కాల్చలేదు. అమ్మా, ఆ వొట్టూ తలపుకు వస్తేనే వణికిపొయ్యేవాడు.

ఎనిమిదేళ్లు గడచినయ్. అమ్మ కష్టపడి చెల్లాయికి పెళ్లిచెయ్య గలిగింది. చెల్లాయి ఇప్పుడు సుఖపడుతున్నది. అమ్మ ఎప్పుడూ ఏవేవో కలలు కనేది. తనతో అప్పుడప్పుడు చెపుతుండేది. తాను సిగ్గుపడేవాడు. లక్ష్మీదేవి వస్తే బావుండునని తానూ అనుకునేవాడు. కలలుకనేవాడు.

కాని అమ్మ ఇవాళలేదు.

ఆమె జీవితం వెలుగులోంచి చీకటిలోకి వచ్చిందే కాని, చీకటి లోంచి వెలుగులోకి రాలేదు. ఆమె ఆశయసాఫల్యత పొందకుండానే బొంది వొదిలేసింది. ఆమె కోరికను తా నిదివరలో మన్నించి వుండా ల్సింది. ఇలా జరుగుతుందని అనుకోలేదు.

వెంకటరత్నం తాలూకాఫీసులో పదిగంటలు కొట్టడం విన్నాడు. కిల్లీ షాపతను లేచి బల్లను లోపల పెడతాను, లేవ మన్నాడు వెంకటరత్నాన్ని.

వెంకటరత్నం లేచాడు.

కిల్లీ షాపతన్ని ఇంకొక సిగరెట్ అడిగితీసుకున్నాడు.

ఎర్రగా కాలిపోతున్న కొబ్బరి తాడుతో సిగరెట్ అంటించు కున్నాడు. ఇంటి సమీపానికి త్వరత్వరగా నడిచాడు. ఇల్లు దగ్గరయ్యే కొద్దీ అతని నడకలో బలం తగ్గిపోయింది.

అతడికి కసిగా ఉంది. అమ్మ ఎనిమిదేళ్ళక్రింద తన చిన్న తనాన వేసినవొట్టు పదే పదే మనసులో తిరుగుతున్నది.

అతడు అనుకున్నట్లుగానే ఇంట్లోకి అడుగుపెట్టటంతోటే చెల్లెలు కనిపించింది. ఒక్కసారి గొల్లుమన్నది.

వెంకటరత్నం ఏమీ మాట్లాడలేదు. ఒక ప్రక్కగా బావ మరిది కూడా విషాదంగా కూచుని ఉన్నాడు. వెంకటరత్నం పెదవుల మధ్య ఎర్రగా కాలిపోతున్న సిగరెట్టును చూసి అంత ఏడుపులోనూ, చెల్లాయి మనసులో విలవిలలాడిపోయింది....

———